epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:365

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 29.07.2026 బుధవారం, హైదరాబాద్

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ సరికాదు



- ఆయన రేపిస్టుల మద్దతుదారు
- బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను వెనకేసుకొచ్చారు
- లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

2లో



## ఆందోళనకారులపై చర్యలు వద్దు

- సీజేపీ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు
- విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లపై ఎలాంటి బలవంతపు, కఠిన చర్యలు తీసుకోవద్దని
- నిరసన రాజ్యాంగబద్ధ హక్కు
- మైనర్లను విడుదల చేయండి
- మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం
- విద్యార్థులపై పోలీసుల చర్యపై ఎన్‌హెచ్‌ఆర్సీ ఆగ్రహం

**తెలంగాణ చౌరస్తా- న్యూఢిల్లీ బ్యూరో**

పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి బలవంతపు, కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 18 ఏండ్లలోపు వారిని, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం విద్యార్థులపై పోలీసుల తీరును తప్పుబట్టింది. రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని గుర్తు చేసింది. తక్షణమే మైనర్లను విడిచి పెట్టాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి మాత్రమే రక్షణ

|మిగతా 2 లో|



## కబ్జాల తొలగింపుపై వెనక్కి తగ్గేదేలే..

### హైడ్రా ఆగదు

‘రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోంది. కబ్జాల తొలగింపుపై వెనక్కి తగ్గేదే లేదు. హైడ్రా తన పని తాను చేసుకుపోతోంది. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సంస్కరణ హైడ్రా. ప్రభుత్వ పార్కులు, చెరు వులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడటమే హైడ్రా ప్రధాన బాధ్యత. ఆ దిశగా సంస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారుల నియామకం ప్రభుత్వ విచక్షణాధికారమని, దానిని ఎవ రూ ప్రశ్నించలేరని, ఆ అధికారాన్ని ఎవ రూ లాక్కోలేరని ఆయన స్పష్టంచేశారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించినోళ్లు కోర్టులను తప్పు దోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని విమర్శించారు.

- ఇది మేం తీసుకొచ్చిన గొప్ప సంస్కరణ
- అధికారుల నియామకంలో ప్రభుత్వ విచక్షణ
- అధికారాన్ని ఎవరూ లాక్కోలేరు
- సోమేష్‌కుమార్‌పై 400కు పైగా కోర్టు ధిక్కరణ కేసులు
- బీఆర్ఎస్ నేతల కబ్జాలపై కేసులు
- గ్లోబరీనా అక్రమాలకు గత ప్రభుత్వమే కారణం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇక సమస్య కాదు
- క్రమం తప్పకుండా చెల్లిస్తాం.. బ్యాంకుల్లో జమచేస్తాం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు ఇవ్వండి
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేష్‌కుమార్‌పై 400కు పైగా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులు ఉన్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడి యాతో మాట్లాడారు. న్యాయస్థానాలపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే హైడ్రా చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపా రు.బతుకమ్మ కుంటను బీఆర్ఎస్ వాళ్లు కబ్జా చేశారని, పైగా

|మిగతా 2 లో|



## హైడ్రా పేరుతో బ్లాక్‌మెయిల్

- మేం వచ్చాక...హైడ్రాను రద్దుచేస్తాం
- హైడ్రా తొమ్మిది తలల విషసర్పంలా మారింది
- హైకోర్టు మందలించినా ప్రభుత్వ వైఖరిలో మార్పు లేదు
- హైడ్రా అనేది సీఎం రేవంత్ రెడ్డి చేతిలో బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థగా మారింది
- డీలిమిటేషన్‌పై అన్ని పార్టీలు కలిసి నిర్ణయం తీసుకోవాలి
- ఢిల్లీలో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైడ్రా పేరుతో బ్లాక్‌మెయిల్, బెదిరింపు రాజకీయాలు జరుగుతున్నాయని, దీని వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా తొమ్మిది తలల విషసర్పంలా మారిందని హైకోర్టు వ్యాఖ్యానించిందని, న్యాయస్థానం వ్యాఖ్యలతోనైనా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే అతిపెద్ద బ్లాక్ మెయిలర్‌లలో ఒకరని, సీఎం కుటుంబ సభ్యులు, మంత్రుల అక్రమ నిర్మాణాలపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. నిషేధిత భూము ల విస్తీర్ణం బీఆర్ఎస్ ప్రభుత్వం

|మిగతా 2 లో|



## లోక్ సభలో వాడీవేడిగా చర్చ

- లీకులపై లడాయి
- పేపర్ లీక్ వ్యతిరేక బిల్లుపై చర్చను ప్రారంభించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- ఈ బిల్లు భారత పార్లమెంట్ చరిత్రలో ఒక మైలురాయి
- పెల్లెట్ గన్స్ వాడాలని ఎవరు ఆదేశించారు
- పోలీసుల తీరు సరికాదు: ప్రియాంక గాంధీ
- విద్యార్థులు వీధుల్లో ఉంటే మోదీ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేశారు
- కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్
- రామ మందిర విరాళాలు దొంగిలించిన వారు పేపర్ లీకులను ఆపలేరు;అఖిలేష్ యాదవ్

2లో



## భార్యపై అనుమానం

- భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు
- దారుణంగా హత్య చేసిన భర్త
- వీడియో తీసి బంధువులకు పంపిన కిరాతకుడు
- ఇనుప రాడ్‌తో దాడి చేసి ఉరితీయడంతో భార్య మృతి
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- కర్ణాటకలో బాగలకోటె జిల్లాలో ఘటన

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి అమానుషానికి పాల్పడ్డాడు. ముందుగా ఇనుప రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన అనంతరం ఉరితీసి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా, ఆ దారుణ ఘటనను తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి స్నేహితులు, బంధువులకు పంపడం కలకలం రేపింది. ఈ ఘటన కర్ణాటకలో బాగలకోటె జిల్లా బిలగి తాలూకాలోని గలగలి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గలగలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జగలూర్కు మహా లింగపురక

|మిగతా 2 లో|

## పెళ్లి కావట్లేదని 29మంది యువకుల ఆత్మహత్య

- ఒంటరితనం తెచ్చిన ఒత్తిడి
- బలవన్మరణాలకు పాల్పడుతున్న యువత
- పోలీస్ సర్వేలో వెల్లడి
- మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా పోలీసుల ప్రత్యేక సర్వే



2లో

## నగరంలో దంచికొట్టిన వర్షం

- ఒక్కసారిగా భారీ వర్షం
- రహదారులన్నీ జలమయం.. చెరువుల్లా మారిన రోడ్లు
- పలుచోట్ల పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు
- ఎక్కడికక్కడ నిలిచిన ట్రాఫిక్
- వాహనదారులకు తప్పని కష్టాలు
- ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



2లో

# హైడ్రా పేరుతో బ్లాక్‌మెయిల్

**తరువాయి భాగం**

దిగిపోయే సమయానికి 16 లక్షల ఎకరాలు ఉంటే, కాంగ్రెస్ హయాంలో అది కోటి ఎకరాలకు చేరిందని కేటీఆర్ ఆరోపించా రు. కమీషన్ల కోసం నిషేధిత భూముల జాబితాను పెంచుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హైడ్రా ను రద్దు చేస్తామన్నారు. భారత్‌లో కూడా జెన్‌జీ ఉద్యమాలు జరిగే అవకాశముందన్నారు. పేపర్ లీకుకు సంబం ధించి కొత్త బిల్లులు తెచ్చే ముందు గత తప్పుల నుంచి ప్రభుత్వం ఏం నేర్చుకుం దో ప్రజలకు చెప్పాలన్నారు.

మంగళవా రం ఢిల్లీలో మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. చట్టం అందరికీ సమా నమైతే ముందుగా సీఎం కుటుంబ సభ్యులు, మంత్రులు, అధికార పార్టీ నాయకుల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వివేక్, ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఏ. తిరుపతిరెడ్డికి సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ నిర్మాణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఎంపిక చేసిన వారిపైనే చర్యలు తీసుకోవడం న్యాయం కాదన్నారు. హైడ్రా చర్యల్లో పారదర్శకత, సమానత్వం ఉండాలని, అధికార పార్టీ నేతలకు ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయం ఉండకూడదని, ఎంపిక చేసిన వారిపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరికాదని కేటీఆర్ విమర్శించారు.హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో వేలాది ఇండ్లను కూల్చివేసి, ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని, దీంతో రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. పెద్ద నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా, సామాన్య ప్రజల ఇండ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. హైడ్రా అనేది సీఎం రేవంత్ రెడ్డి చేతిలో బ్లాక్‌మెయిలింగ్ సాధనంగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని తెలిపారు.

**రైల్వే మంత్రితో కేటీఆర్ భేటీ..**

రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల తరఫున రైల్వే, ఐటీ రంగాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మంగళవారం ఢిల్లీలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ సీనియర్ నేత జాన్సన్ నాయక్‌లతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన కేటీఆర్.. తెలంగాణకు సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులపై వినతిపత్రం అందజేశారు.

సౌత్ సెంట్రల్ రైల్వే పునర్విభజన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, ఈ డివిజన్‌లో కాజీపేటపెద్దపల్లి, కాజీపేటడోర్నకల్, మోతమర్రి తదితర రైల్వే సెక్షన్లను చేర్చాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. ఈ డివిజన్ పరిధి సుమారు 2 వేల ట్రాక్ కిలోమీటర్ల వరకు ఉంటుందని వివరించారు.కేవలం 900 కిలో మీటర్లతో గుంటూరు డివిజన్, సుమారు 2,200 కిలో మీటర్లతో విజయవాడ, గుంతకల్ డివిజన్లు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు పరిపాలనా, అభివృద్ధి పరంగా ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. రైల్వే ఉద్యోగులు కూడా కాజీపేట డివిజన్ ఏర్పాటుకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు.

# కబ్జాల తొలగింపుపై వెనక్కి తగ్గేదేలే..

**తరువాయి భాగం**

దానిపై కంటెంప్ట్ కోర్టు కేసు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైడ్రా ఎన్ కన్వెన్షన్, గండిపేట చెరువు ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు పేదలపై కాదని, ఆక్రమణదారులపై మాత్రమేనని స్పష్టంచేశారు. కబ్జాదారులను కాపాడేందుకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, కబ్జాకోరులకు సహకరించవద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధిహామీ పనుల విషయంలో సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి మంత్రి స్పందించారని సీఎం తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం పేర్కొన్నారు

ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులకు నమ్మకం కలిగించేలా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షల సమయంలో సమస్యలు తక్కువగా ఉన్నాయని, ఆఫ్‌లైన్ విధానంలోనే ఎక్కువ ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీఎం పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇకపై ఆలస్యం కాదని, ప్రతి విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే ఏడాది పూర్తిగా చెల్లించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అవసరమైతే ముందస్తుగానే వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసే విధానాన్ని కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు అవసరమవుతుందని పేర్కొన్నారు.సరైన వసతులు లేకుండా, తప్పుడు లెక్కలతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకు ప్రయత్నించే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసిందనే భావన కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని, దానికి బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని సీఎం విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వదిలి వెళ్లిందని, ఆ సమస్యను పరిష్కరించడంతో పాటు , భవిష్యత్తులో సమస్యలు రాకుండా కొత్త విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఏపీలో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్. కష్ణయ్య ఎందుకు స్పందించడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ముందుగా 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయించిన తర్వాత తెలంగాణపై డిమాండ్లు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలకు సూచించారు.

**కేంద్ర మంత్రి చౌహాన్‌తో సీఎం భేటీ..**

పేదలకు సొంత ఇళ్లు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంగళవారం ఢిల్లీలోని కృషి భవన్‌లో భేటీ అయ్యారు. తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ (పీఎంఏవైజీ) కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం పీఎంఏవైజీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇండ్ల నిర్మాణంలో వెనుకబాటు ఏర్పడిందని సీఎం తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వివరించారు. వీలైనంత త్వరగా ఇండ్ల కేటాయింపులు జరపాలని కేంద్ర మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉపాధిహామీ పథకంలో అదనపు పనులను చేర్చాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు.రైతుల భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస అభివృద్ధి, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇంటి పరిసరాల్లో కూరగాయల తోటలు, వెదురు సాగు వంటి పనులకు అవకాశం కల్పించాలన్నారు. కొండప్రాంతాల్లో నీటినిల్వల కోసం కందకాల నిర్మాణం, పండ్ల తోటల్లో తేమ పరిరక్షణ పనులు, వరదలు, ఇసుక మేటల వల్ల దెబ్బతిన్న భూముల పునరుద్ధరణను కూడా చేర్చాలన్నారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, బలరాంనాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘురాంరెడ్డి, సురేష్‌షెట్కార్, వంశీకష్ణ, అనిల్ ఉన్నారు.

# ఆందోళనకారులపై చర్యలు వద్దు

**తరువాయి భాగం**

కల్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. నిరసనకారుల పట్ల పోలీసులు తీసుకున్న చర్యలపై వివరణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది. వాళ్లు తమ వాదనలు వినిపించవచ్చని తెలిపింది. సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, ఇతర రికార్డులకు చెందిన వీడియోలను దాచిపెట్టాలని ఆదేశాల్లో పేర్కొంది. అదే విధంగా పోలీసులు రికార్డు చేసిన నిరసనకారులకు చెందిన పర్సనల్ డేటా కానీ, వివరాలను కానీ పబ్లిష్ చేయవద్దని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ వాడిన అంశంపైనా ధర్మాసనం వాదనలు విన్నది. నేర చరిత్ర లేని విద్యార్థులను తక్షణమే రిలీజ్ చేయాలని పేర్కొంది. ఆగస్టు 3న తదుపరి విచారణను చేపట్టనుంది.

**స్వతంత్ర విచారణ జరగాల్సిందే**

'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు. తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ'జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. విద్యార్థులకు, పోలీసులకు జరిగిన గాయాల పట్ల నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని పేర్కొంది. దీని కోసం మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. కాగా 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని సీజేఐ పేర్కొన్నారు.

**శాంతియుత నిరసన రాజ్యాంగబద్ధమైన హక్కు**

ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన (ఏకీకృత) ప్రొటోకాల్ అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

**బీహార్, అసోంలో విద్యార్థులపై కేసుల ఉపసంహారణ**

నీట్ పరీక్షా పత్రం లీకేజీలో అవకతవకలపై ఆందోళనలు చేపట్టిన విద్యార్థులకు ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను బీహార్, అసోం ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. నిరసనకారులపై నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకుంటామని, వివిధ ఆరోపణల కింద జైలు పాలైన వారిని విడుదల చేస్తామని బీహార్ ప్రభుత్వం ప్రకటించింది.

అలాగే అసోంలో జులై 26 నాటికి నమోదైన ఐదు కేసుల్లో అరెస్టైన 13 మందితో పాటు, ఇరు రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అసోం, బీహార్ తరహాలోనే రాజస్తాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరిం చుకుంటామని తెలిపినట్టు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. కేంద్రం హామీలను ఉల్లంఘిస్తోందని, మళ్లీ ఉద్యమం చేస్తామని సోమవారం సీజేపీ ప్రతినిధులు హెచ్చరించిన నేపథ్యం లో ఆయా రాష్ట్రాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**విద్యార్థులపై పోలీసుల చర్యపై ఎన్‌హెచ్‌ఆర్సీ ఆగ్రహం**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసనలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ పట్ల నేషనల్ హ్యూమనట్ రైట్స్ కమిషన్ (ఎన్ హెచ్‌ఆర్సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది.

# భార్యపై అనుమానం

**తరువాయి భాగం**

ు చెందిన భాగ్యశ్రీ (23)ని ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అయితే వివాహం జరిగిన కొంతకాలం తర్వాత నుంచే భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రెండు నెలల క్రితం భాగ్యశ్రీ తన పుట్టింటికి వెళ్లిపోయింది.

**పెద్దల జోక్యంతో ఇంటికి వచ్చిన భార్య**

ఇరు కుటుంబాల పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరికీ సర్దిచెప్పడంతో, సోమవారం భాగ్యశ్రీ తిరిగి భర్త ఇంటికి వచ్చింది. అయితే ఇంటికి వచ్చిన కొద్ది గంటల్లోనే మరోసారి చిన్న విషయంపై వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. ఆగ్రహానికి లోనైన ప్రవీణ్, ఇంట్లో ఉన్న ఇనుప రాడ్‌తో భార్యపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన భాగ్యశ్రీపై అనంతరం మరింత దారుణంగా ప్రవర్తించి ఆమెను ఉరితీసి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

ఈ ఘటనలో మరింత కలకలం రేపిన అంశం ఏమిటంటే, భార్యను హత్య చేసిన తర్వాత నిందితుడు ఆ దృశ్యాలను తన మొబైల్ ఫోన్‌లో వీడియోగా చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోను తన స్నేహితులు, బంధువులకు పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయం బయట పడటంతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. భాగ్యశ్రీ తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, తమ కుమార్తెపై అక్రమ సంబంధం ఉందంటూ అనుమానిస్తూ ప్రవీణ్ తరచూ వేధించేవాడని ఆరోపించారు. అదే అనుమానంతో ఈ హత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**విచారణ కొనసాగిస్తున్న పోలీసులు**

ఘటనకు ముందు నిందితుడు మద్యం సేవించాడా? హత్యను ముందే ప్రణాళికబద్ధంగా చేశాడా? వీడియో చిత్రీకరించి పంపడం వెనుక ఉద్దేశం ఏమిటి? వంటి కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. మొబైల్ ఫోన్‌లోని వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాలు, అనుమానాలు చివరకు ఓ మహిళ ప్రాణాలను బలితీసుకోవడం విషాదకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# లోక్ సభలో వాడీవేడిగా చర్చ

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

నీట్ ప్రశ్నాపత్రం లీక్.. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడటం.. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన పేపర్ లీక్ వ్యతిరేక బిల్లు (పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్ట సవరణ) పై మంగళవారం లోక్ సభలో చర్చ వాడీవేడిగా ప్రారంభమైంది. 10 గంటల పాటు చర్చకు సిద్ధంగా ఉన్న ట్లు కేంద్రం ప్రకటించింది.ఈ బిల్లుపై చర్చను ప్రారంభించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. ఈ చట్టాన్ని ముందుగా ఎన్డీఏ ప్రభుత్వమే ప్రవేశపెట్టిందని, స్వతంత్ర భారత దేశంలో ఇది బహుశా మొట్టమొదటిది అని అన్నారు. ఈ బిల్లు భారత పార్లమెంట్ చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించామని.. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచామని చెప్పారు.లీకేజీ గ్యాంగ్లకు జరిమానాను రూ. కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచామని.. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలో చాలా పేపర్లు లీక్ అయ్యాయన్నారు. అనంతరం మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్.. పరీక్షా పత్రాల పేపర్ లీక్ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదని అన్నారు. రెండేళ్ల క్రితం అసలు బిల్లును ప్రవేశపెట్టినప్పుడు, విద్యా రంగాన్ని బలోపేతం చేసే, పేపర్ లీక్‌లను అరికట్టే చారిత్రాత్మక చర్యగా ప్రభుత్వం దానిని అభివర్ణించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రతిపాదించిన సవరణలు కేవలం కంటితుడుపు చర్య అని విమర్శించారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. మోదీ మాత్రం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ కూర్చున్నారని విమర్శించారు. సోమవారం బీజేపీ నేతలు ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్ లో ఘన స్వాగతం పలకడాన్ని ఆయన తప్పుపట్టారు.తర్వాత మాట్లాడిన బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పిలుపునిచ్చినప్పుడు పంజాబ్ విద్యా శాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేశారా అని గగోయ్‌ను ప్రశ్నించారు. మరోవైపు విద్యా శాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించడం ద్వారా ప్రభుత్వం ప్రధానిని కాపాడిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. తమ డిమాండ్లను అంగీకరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన జెన్ జీని ఆయన ప్రశంసించారు.జవాబుదారీతనం అంటే అవినీతిపరుల బ్యాంకు ఖాతాలను నింపగల సామర్థ్యమని బీజేపీ ప్రభుత్వం భావిస్తోందా? అని ఆయన ప్రశ్నించారు. రామ మందిర విరాళాల డబ్బును దొంగిలించిన వారు పేపర్ లీక్‌లను ఆపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని వెనుకబడినవర్గాల విద్యాహక్కులను దొంగిలించిందని, దేశవ్యాప్తంగా లక్షకు పైగా పాఠశాలలను మూసివేసిందని ఆరోపించారు.కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ, ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించడాన్ని, లాఠీ ఛార్జి చేయడాన్ని తప్పుబట్టారు. ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. నిరసనకారులపై పెల్లెట్ గన్స్, బాష్పవాయు గోళాలు, లాఠీచార్జ్, వాటర్ క్యానన్లను ఉపయోగించాలని ఆదేశించింది ఎవరో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దేశ యువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుండగా.. వారిపై దాడి చేయడం సరైన చర్య కాదన్నారు. విద్యార్థుల నిరసనను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌ల కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషీని ఈ దేశ మహిళలు అంగీకరించరని అన్నారు.

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ సరికాదు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.


ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు. అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా చూడాలి. కానీ, అలా జరగనందువల్లే ఇటీవలి రోజుల్లో వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు



# నగరంలో దంచికొట్టిన వర్షం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది.రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడా, ఉప్పరపల్లి, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్‌గూడా టీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్-216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.కేపీహెచ్‌బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది.మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ జామ్దిల్‌సుఖ్నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్‌పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచనలు చేశారు.



# పెళ్లి కావట్లేదని 29మంది యువకుల ఆత్మహత్య

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

యుక్త వయస్సు వచ్చాక జీవిత భాగస్వామిని వెతుక్కోవడం, పెళ్లి చేసుకొని స్థిరపడడం ప్రతి ఒక్కరు కనే ఒక అందమైన కల. కానీ, నేటి సమాజంలో ఆ పెళ్లి అనే మాటే కొందరి పాలిట శాపంగా మారి, స్వయంగా ప్రాణాలు తీసుకునేంతంటి మానసిక భారంగా మారుతోంది. మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో ఏకంగా 29 మంది యువకులు పెళ్లి కాలేదనే బాధతో బలవన్మరణాలకు పాల్పడడం చూస్తుంటే, ఈ సమస్య ఎంత తీవ్రతంగా ఉందో తెలుస్తోంది. ఏంటీ ఆశ్చర్యంగా ఉందా? నమ్మలేక పోతున్నారా? అయితే ఈ పూర్తి కథనం చదవండి.

మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా పోలీసులు ఒక ప్రత్యేక సర్వే చేశారు. జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య ఆ జిల్లాలో మొత్తం 443 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 383 మంది పురుషులు, 29 మంది మహిళలు, 8 మంది బాలురు, 11 మంది బాలికలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, బాధ్యతలు, సామాజిక, మానసిక ఒత్తిడులు లాంటి వివిధ కారణాలతో వారు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వీటన్నింటి కంటే ఘోరం ఏమిటంటే, పెళ్లి కాలేదనే నిరాశతో ఏకంగా 29 మంది యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు.వివాహ వయస్సు పెరిగిపోవడం, సరైన భాగస్వామి దొరకకపోవడం, సమాజం నుంచి వచ్చే ఒత్తిడి, మానసిక ఆందోళనలు మొదలైనవి యువతపై చాలా చెడు ప్రభావం చూపిస్తున్నాయని, ఇవే పురుషుల్లో ఆత్మహత్య సంఖ్య ఎక్కువగా ఉండడానికి కారణమవుతున్నట్లు డేటా స్పష్టం చేస్తోంది. దీనికంటే ఘోరం ఏమిటంటే, ఆ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు 12 మందిపై కేసులు నమోదు అయ్యాయి. అంటే ఎదుటి వ్యక్తులను ఆత్మహత్యకు ప్రేరేపించే వాళ్లు కూడా సమాజంలో పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటితోపాటు పిల్లలు, కౌమార దశలో ఉన్నవారు కూడా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కుటుంబ కలహాలు, చదువుల ఒత్తిడి, ప్రేమ వ్యవహారాలు, భావోద్వేగ సమస్యలే ఇందుకు కారణమని పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. అంటే యువతతోపాటు సమాజంలోని అన్ని వయస్సుల వారూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

**సకాలంలో మానసిక చికిత్స చేయాల్సిందే**

మానసిక ఒత్తిడికి సంబంధించి సంకేతాలు సకాలంలో గుర్తించడం ఎంతో ముఖ్యమని మానసిక నిపుణులు (సైకియాట్రిస్టులు) నొక్కి చెబుతున్నారు. డిప్రెషన్తో బాధపడుతున్న వ్యక్తులతో కుటుంబ సభ్యులు ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఉండాలని సూచిస్తున్నారు. ఇలా మాట్లాడుతూ, వారి భావాలను అర్థం చేసుకుంటూ, మానసికంగా మద్దతు (ఎమోషనల్ సపోర్టు) అందించాలని సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు కచ్చితంగా మానసిక వైద్యులను లేదా కౌన్సిలర్లను సంప్రదించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. మానసిక ఆరోగ్య సమస్యలను ఒక అవమానంలా భావించకుండా, సకాలం చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జలగావ్ పోలీసులు విడుదల చేసిన ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, సమాజానికి ఇదొక తీవ్రమైన హెచ్చరిక అని వారు చెబుతున్నారు. పెళ్లి, చదువు, ఉద్యోగం అనేవి జీవితంలో భాగాలు మాత్రమే, అవే జీవితం కాదనే స్పృహను యువతతోపాటు ప్రతి ఒక్కరికి కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మానసిక నిపుణులు అంటున్నారు. మన చుట్టూ ఉన్నవారికి కాస్త సమయం, కొద్దిగా ప్రేమను అందిస్తే, ఈ ఆత్మహత్యలను కచ్చితంగా అడ్డుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

29.07.2026
బుధవారం,
హైదరాబాద్

GENERAL NEWS జనరల్ న్యూస్

తెలంగాణ చౌరస్తా



# తెలంగాణ సాధనలో జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- మాజీ కేంద్ర మంత్రి బండి రమేష్

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**




తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మాజీ కేంద్ర మంత్రి దివంగత జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి ఏబ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ వెంకటేశ్వర్ నగర్ లో సోమవారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ హాజరై జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంట్ వేదికగా జైపాల్ రెడ్డి తనదైన వాదనతో బలమైన స్వరాన్ని వినిపించారని గుర్తు చేశారు. తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో ప్రతిధ్వనింపజేయడంలో, రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఏర్పడేలా చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణాత్మక దృష్టి, పరిపాలనా నైపుణ్యంతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడు జైపాల్ రెడ్డి అని బండి రమేష్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమర్థవంతమైన పరిష్కారాలను చూపగల రాజకీయ చతురుడిగా, ట్రబుల్ షూటర్‌గా ఆయనకు విశేష గుర్తింపు లభించిందన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావం, రాజకీయ విలువలు, నిబద్ధత నేటి రాజకీయ నాయకులకు, యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. జైపాల్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము సంతోష్, పులి శివగౌడ్, చంద్ర, నాగార్జున, క్రాంతి, నర్సింగ్, రాము, రమణ, జ్యోతి, శ్రీనివాస్, పార్వతి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.




# వరద సాకుతో చెక్‌డ్యాం కూల్చివేతా?

- వరదను సాకుగా చూపి ప్రజలకు ఉపయోగపడిన చెక్‌డ్యాంను కూల్చేశారని బీఆర్ఎస్ ఆరోపణ
- తాగు, సాగునీటిపై దెబ్బ కొట్టారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు
- కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులనే లక్ష్యంగా చేసుకున్నారంటూ బీఆర్ఎస్ ఆరోపణ
- చెక్‌డ్యాం కూల్చివేతతో రైతులు
- మత్స్యకారులు నగర ప్రజలు నష్టపోయారంటూ బీఆర్ఎస్ విమర్శ
- 'విధ్వంస రాజకీయాలు మానండి..
- అభివృద్ధిని కాపాడండి' అంటూ కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ హితవు..

**తెలంగాణ చౌరస్తా, ఖమ్మం :**

ఖమ్మం మున్నేరు ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాం కూల్చివేతపై బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7.45 కోట్లతో నిర్మించిన ఈ చెక్‌డ్యాం నగర తాగునీరు, రైతులకు సాగునీరు, భూగర్భజలాల పెంపు, మత్స్యకారుల ఉపాధికి ఎంతో ఉపయోగపడిందని పేర్కొంది. అయితే వరద ముప్పు పేరుతో చెక్‌డ్యాంను కూల్చివేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆరోపించింది. ప్రస్తుతం నగరంలో తాగునీటి సమస్యలు, భూగర్భజలాల తగ్గుదల కనిపిస్తున్నాయని, ఈ పరిస్థితికి ప్రభుత్వ నిర్ణయమే కారణమని బీఆర్ఎస్ విమర్శించింది. కాగా, చెక్‌డ్యాం కూల్చివేతను ప్రభుత్వం వరద భద్రతా కారణాలతో సమర్థించిన విషయం తెలిసిందే.



# కొత్తగూడెంలో 'దా న్యూస్' మ్యాగజైన్ ఆవిష్కరణ

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరణ
- నిజాయితీతో కూడిన వార్తలతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే కూనంనేని

**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

ప్రజలకు నిజాయితీతో కూడిన వార్తలను అందిస్తూ, సమాజ అభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు.కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 'దా న్యూస్' మ్యాగజైన్‌ను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మ్యాగజైన్ జిల్లా కరస్పాండెంట్ నక్క శ్రీనివాస్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ... సమాజంలో వెనుకబడిన వర్గాల గొంతుకగా, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఈ మ్యాగజైన్ నిలవాలని ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన పత్రికా రంగం ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 'దా న్యూస్' మ్యాగజైన్ ప్రతినిధి నక్క వాసు, నిజం న్యూస్ జిల్లా బ్యూరో సత్యనారాయణ, వార్త తరంగాలు జిల్లా బ్యూరో రత్నకుమార్, తెలంగాణ చౌరస్తా జిల్లా బ్యూరో రిషి, మీడియా టుడే రిపోర్టర్ వినోద్, అక్షిత రిపోర్టర్ సతీష్‌లతో పాటు పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న జర్నలిస్టులు 'దా న్యూస్' మ్యాగజైన్ మరింత ప్రజాదరణ పొందాలని శుభాకాంక్షలు తెలియజేశారు.




# రోడ్డు కుంగి ప్రమాద కరంగా మారిన కల్వర్టు

- త్వరలోనే రోడ్డు మరమ్మతులు
- భారీ వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకోవాలి

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పేరపల్లి నుండి రొంపికుంట గ్రామం వెళ్లే ప్రధాన రహదారిలోని పోచమ్మ మూలమలుపు వద్ద ఉన్న కల్వర్టు తీవ్ర ప్రమాదకరంగా మారింది. కల్వర్టు పైన తారు రోడ్డు యథావిధిగా కనిపిస్తున్నప్పటికీ, కింద ఉన్న పైపులు కుంగిపోవడంతో పాటు మట్టి జారిపోయి రోడ్డు కింద పెద్ద ఖాళీ స్థలం ఏర్పడింది. ఈ విషయం పై పేరపల్లి గ్రామ సర్పంచ్ స్పందించి కమాన్‌పూర్ మండల ఇన్చార్జి పంచాయతీ రాజ్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా, రొంపికుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ తో కలిసి క్షేత్రస్థాయికి వచ్చి కల్వర్టును పరిశీలించి ప్రమాద తీవ్రతను గుర్తించారు. ఈ సందర్భంగా పేరపల్లి గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. శాఖాపరంగా అనుమతులు వచ్చి మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రయాణికులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ప్రమాదాలను నివారించేందుకు భారీ వాహనాలు ఈ దారి గుండా వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# గురువే గొప్ప గురుతు

- వేదవ్యాసుడి బోధనలే విజయానికి బాట
- బాదావత్ బాలాజీ
- గురువుల మార్గదర్శకత్వంతోనే మహోన్నత జీవితం
- సత్యం, ధర్మం ఆచరిస్తేనే జీవితం సార్థకం..

**తెలంగాణ చౌరస్తా, వైరా:**



గురు పౌర్ణమి సందర్భంగా వైరా నియోజకవర్గం నాయకులు బాదావత్ బాలాజీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని పేర్కొన్నారు. వేదవ్యాస మహర్షి బోధించిన సత్యం, ధర్మం, దయ, ధ్యానం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. గురువుల మార్గదర్శకత్వంలో విజ్ఞానం, సంస్కారం అలవర్చుకొని మహోన్నత ఆశయాలతో జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# వర్డ్ అండ్ డీడ్ హై స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

వర్డ్ అండ్ డీడ్ హై స్కూల్‌లో సోమవారం విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకార (ఇన్వెస్టిచర్) వేడుక ఘనంగా జరిగింది. పాఠశాల సీఈఓ ఎబెనేజర్ ముఖ్య అతిథిగా హాజరై ఇటీవల ఎన్నికల ద్వారా ఎంపికైన హెడ్ బాయ్,హెడ్ గర్ల్‌తో పాటు పాఠశాల కమిటీ ఎంపిక చేసిన ప్రిఫెక్ట్ బాడీకి బ్యాడ్జీలు,సాషూలు తొడిగించారు.అనంతరం విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం, కవాతు వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా సీఈఓ ఎబెనేజర్ మాట్లాడుతూ.. నాయకత్వం అనేది కేవలం అధికారం కాదని, బాధ్యతతో కూడిన సేవ అని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.డి.ఎ. ప్రియదర్శిని,పాస్టర్ శాంత కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను పెంపొందిస్తుందన్నారు. ఈ వేడుకలో పీఈటీలు, ఎన్‌సీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని నూతన విద్యార్థి నాయకులను అభినందించారు.



# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్వి నందలాల్ పవార్

**తెలంగాణ చౌరస్తా నడిగూడెం:**

సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్వి నందలాల్ పవార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం 100 వ ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులతో కలసి వర్చువల్ గా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నడిగూడెం మండల కేంద్రగల రైతు వేదిక నందు మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్వి నందలాల్ పవార్ హాజరై వీక్షించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రైతులకు అవసరమైన సేవలో సాంకేతిక సహాయం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి రైతుకు చేరేలా కృషి కృషి చేస్తుందన్నారు. రైతుల అభ్యున్నతికి చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బోర్ల కింద చెరువుల కింద వ్యవసాయం చేసే రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలైన పెసర్లు కందులు సాగు చేయాలని కోరారు.అదేవిధంగా ఆయిల్ ఫామ్ సాగు చేసేటట్లు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని తెలిపారు. అదేవిధంగా నడిగూడెం, మఠంపల్లి మండలాలకు ఉత్తమ రైతులుగా ఎంపికైన వాసికర్ల శేషు బాబు, గురువారెడ్డి లను శాలువా మెమొంటోలతో జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలో గల కూరగాయల పంట సాగు చేస్తున్న దున్నా రవి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, డీఎఫ్ఓ మండల ప్రత్యేక అధికారి దామోదర్ రెడ్డి,తహసిల్దార్ మంగా,ఎంపీడీవో మల్సూర్ నాయక్,ఏడిఎ జ్ఞానేశ్వరి, ప్రశాంతి,ఏఓ మల్సూర్, నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ ఏఈఓ వెంకటరెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు,రైతులు, అధికారులు పాల్గొన్నారు.



# గుండారం రైతు వేదికలో విత్తన మేళా

- ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు


**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండలంలోని గుండారం రైతు వేదికలో ప్రత్యేక విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఎల్నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడి, వరి నార్లు ముదిరిపోయిన తరుణంలో పొలాలను బీడుగా ఉంచకుండా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. మంథని ఏడీఏ ఎన్. అంజని, ఏఓ రామకృష్ణ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు కంది విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. నీటి వసతి లేని రైతులకు ఉచితంగా ఆముదం విత్తనాలు ఇస్తామని, పండిన పంటను కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. అలాగే తక్కువ నీటితో ఆయిల్ పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఉద్యానవన పంటలపై ఆసక్తి ఉన్న రైతులకు బంగన్‌పల్లి, తోతాపురి మామిడి మొక్కలను ఉచితంగా ఇస్తున్నామని, వివరాలకు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవీన్, రైతులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో భారీ అక్రమాలు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**



డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అవకతవకలకు పాల్పడుతోందని, నిరుపేదలకు అందాల్సిన ఇళ్లను మంత్రులు, ఉన్నతాధికారుల సిఫార్సుల తో వారి అనుచరులకు కేటాయిస్తున్నారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు పత్రాలు, వివరాలను విడుదల చేస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. దేశ ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని ఆయన విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో పారదర్శకత పూర్తిగా కొరవడిందని అన్నారు. కూకట్ పల్లి ఖైతలాపూర్ లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 145 డబుల్ బెడ్ రూం ఇళ్లను నాలా పక్కన నివసిస్తున్న అమృత్ నగర్ తండా నిరుపేదలకు కేటాయించాలని తాము నిరంతరం డిమాండ్ చేశామని, అదే లక్ష్యంతో ప్రభుత్వానికి పలు సూచనలు కూడా చేశామని తెలిపారు.నిరుపేదల తో పాటు వికలాంగులకు కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అర్హులను పక్కనబెట్టి, సిఫార్సుల ఆధారంగా ఇళ్ల కేటాయింపులు చేస్తోందని ఆరోపించారు. హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ సిఫార్సు తో ఒకరికి, హైదరాబాద్-రంగారెడ్డి కలెక్టర్ సిఫార్సు తో మరొకరికి, ఖమ్మం లో నివసిస్తున్న మహిళకు కూకట్ పల్లిలో డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అలాగే ఎండోమెంట్ కమిషనర్ సిఫార్సు తో ఒకరికి, కుత్బుల్లాపూర్ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ప్రత్యూషకు, అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సుల తో మరికొందరికి ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సిఫార్సు తో నరేష్ కుమార్ కు, మాజీ పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ కుటుంబానికి సంబంధించిన పేరుతో మరో వ్యక్తికి కూడా ఇల్లు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రులు, కలెక్టర్లు సిఫార్సు లేఖలు ఇచ్చి ఇళ్లను కేటాయించడం ప్రజాపాలనకు విరుద్ధమని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అసలు లబ్ధిదారులకు కాకుండా ఇతరులకు కేటాయించడం అన్యాయమన్నారు. కేసీఆర్ హయాంలో మహిళల పేర్లపై మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయని, ప్రస్తుతం పురుషుల పేర్లపై కూడా రిజిస్ట్రేషన్లు జరగడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో కనీస నిబంధనలు కూడా పాటించడం లేదని, ఎలాంటి దరఖాస్తులు చేయని వ్యక్తులకు కూడా రాజకీయ సిఫార్సులతో ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. పైరవీ లేఖల పేరుతో అక్రమాలు, డబ్బుల లావాదేవీలు జరుగుతున్నాయంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. దరఖాస్తుల పేరుతో రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నారని, మరికొందరిని రూ.6.5 లక్షలు చెల్లిస్తే ఇళ్లు కేటాయిస్తామని ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. అంత పెద్ద మొత్తాన్ని నిరుపేదలు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పంపిణీ చేశామని గుర్తుచేసిన ఎమ్మెల్యే, ప్రస్తుతం జరుగుతున్న కేటాయింపులపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని పేర్కొంటూనే, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవినీతిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అక్రమ కేటాయింపులను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసిన మాధవరం కృష్ణారావు, అవసరమైతే ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# వైభవంగా మొక్కల పంపిణీ కార్యక్రమం

- ఇంటింటికీ 3 మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్ బట్టు శివ,

**భద్రాద్రి జిల్లా టేకులపల్లి, తెలంగాణ చౌరస్తా:**



పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా శాంబునిగూడెం గ్రామ పంచాయతీలో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ ఉచితంగా 3 మొక్కల చొప్పున పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్టు శివ ఉపసర్పంచ్ ధమాషాలపూడి శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి కొర్రసా అన్వేష్ వార్డు మెంబర్ బట్టు బాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని గ్రామస్థులకు మొక్కలను అందజేశారు.

**రకరకాల పండ్లు, పూల మొక్కలు:**

గ్రామ ప్రజల ఆరోగ్యం, ఇంటి ప్రాంగణాల అందాన్ని పెంపొందించే దిశగా ఈ క్రింది రకాల మొక్కలను అందించారు పండ్ల మొక్కలు జామ, నిమ్మ, ఉసిరి, నేరేడు, ఖర్జూరం పూల మొక్కలు చామంతి, మందారం, గులాబీ.

**ప్రకృతి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత:**

ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు శివ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పంపిణీ చేసిన మొక్కలను కేవలం నాటడమే కాకుండా, అవి పెరిగి పెద్దయ్యే వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలని గ్రామస్థులను కోరారు. పచ్చని చెట్లతోనే గ్రామం సుభిక్షంగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి కొర్రసా అన్వేష్ వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొక్కలు అందుకున్న గ్రామ మహిళలు పంచాయతీ పాలక వర్గానికి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ఘనంగా గంగుల జన్మదిన వేడుకలు

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా:**

రామన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పల్లివాడ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక సుభాష్ సెంటర్‌లో వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నకిరేకల్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడిగా, పార్టీ బలోపేతానికి గంగుల వెంకట రాజిరెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి

- కోదాడ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**తెలంగాణ చౌరస్తా, సూర్యాపేట:**

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఇందులో భాగంగానే కోదాడ 100 పడకల అసుపత్రిని నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కోదాడ ఏరియా అసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదాడ 100 పడకల ఆసుపత్రిని నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడొద్దని నాణ్యతలో ఏమైనా తేడాలు ఉంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా మెట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆస్పత్రికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ఆసుపత్రుల్లో గర్భిణిలకు సాధారణ ప్రసవం జరిగేలా చుడాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, ఆస్పత్రి సూపరెండెంట్ దశరథ నాయక్, తహసిల్దార్ సంతోష్‌కిరణ్ , డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

- పక్క సమాచారంతో పేకాట స్థావరంపై పోలీసుల దాడి
- రూ. 25,020 నగదు, 5 మొబైల్స్, 3 బైకులు స్వాధీనం

**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

సుల్తానాబాద్ మండలంలోని చిన్నబొంకూర్ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలో గల ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం పట్టుకొని అరెస్ట్ చేశామని సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు తెలిపారు. సుల్తానాబాద్ ఎస్ఐ వివరాల ప్రకారం.. రైల్వే ట్రాక్ సమీపంలో గల ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించగా ఐదుగురిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరి నుంచి రూ. 25,020 నగదు, 5 మొబైల్స్, 3 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ... ఎవరైనా చట్టా వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

# గురుపట్ల గౌరవం – ప్రకృతిపట్ల బాధ్యత

- ఆచార్య సాగి కమలాకర శర్మ జన్మదినోత్సవం
- మొక్క నాటి జరుపుకున్న ఎం.ఏ. తెలుగు విద్యార్థులు.

**తెలంగాణ చౌరస్తా,సికింద్రాబాద్ :**

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఎం.ఏ. ప్రథమ సంవత్సరం విద్యార్థులు తమ గురువు ఆచార్య సాగి కమలాకర శర్మ జన్మదినాన్ని మంగళవారం వినూత్నంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఒక మొక్కను నాటి గురుభక్తిని, పర్యావరణ పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొక్కను నాటిన అనంతరం దానిని సంరక్షించేందుకు విద్యార్థులు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ. "జన్మదినం పేరుతో కేకులు కత్తిరించడం కంటే, ఒక మొక్కను నాటి ప్రకృతికి సేవ చేయడం ఎంతో గొప్ప విషయం. విద్యార్థులు ఇలాంటి ఆలోచనతో ముందుకు రావడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ప్రకృతిని ప్రేమించే ఈ తరం సమాజానికి ఆదర్శంగా నిలవాలి. మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు.విద్యార్థుల గురుభక్తిని,



ప్రకృతి ప్రేమను అధ్యాపకులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు గురుశిష్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంతోపాటు గురుపట్ల గౌరవాన్ని వినూత్నంగా వ్యక్తీకరించిన సందర్భంగా నిలిచింది.కార్యక్రమంలో ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ. కొండ.నాగేశ్వర్ ,తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొ. రఘు ,తెలుగు శాఖ విద్యార్థులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బండారి మహేందర్ ముదిరాజ్

- బాధ్యత అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు

**తెలంగాణ చౌరస్తా, సికింద్రాబాద్ :**

తెలంగాణ రక్షణ సేన (TRS) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలను ప్రకటించారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా బండారి మహేందర్ ముదిరాజ్‌ను నియమిస్తూ ఆమె నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బండారి మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని చెప్పారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు,



అభిమానులు,శ్రేయోభిలాషుల కు నియోజకవర్గ ప్రజలకు, ధన్యవాదాలు తెలిపారు.పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రతినిధులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు పార్టీ నేతలు మహేందర్ ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మానసిక స్థితి సరిలేని మహిళ అదృశ్యం

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ ప్రాంతానికి చెందిన కె.లక్ష్మి (39) అనే మహిళ గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఈ నెల 27న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో,బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో బాధితురాలి భర్త కె.నారాయణ నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు.





# పేదలకు దూరమవుతున్న వైద్యం

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట మండలం, కోటకొండ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని డిప్యూటేషన్ ల పేరుతో డిఎంహెచ్ఓ కార్యాలయానికి తీసుకెళ్తున్నారని,దాంతో పూర్తిస్థాయిలో పేద ప్రజలకు వైద్యం అందించడంలో విఫలమవుతున్నారని కోట కొండ ప్రజలు వాపోయారు. మంగళవారం జరిగిన గ్రామసభలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందడం లేదని చెప్పి, డాక్టర్ ప్రతిభ భారతిని సర్పంచ్,ప్రజాప్రతినిధులు,ప్రజలు ప్రశ్నించడంతో పూర్తిస్థాయిలో ఉన్న సిబ్బందిని జిల్లా వైద్యాధికారులు డిప్యూటేషన్ల పేరుతో డిఎంహెచ్ఓ కార్యాలయానికి తీసుకెళ్తున్నారని ఆమె తెలియజేశారు.టెంపరరీగా డిప్టేషన్ మీద వచ్చిన అటెండర్ కనీసం వచ్చిన పేషంట్లకు సర్వీస్ చేయడం లేదని అడిగితే,జిల్లా వైద్యాధికారులు ఇక్కడికి బలవంతంగా పంపించారని,అటెండర్ ఇచ్చిన సమాధానంతో గ్రామసభలోని ప్రజలు నిర్ఘాంతపోయారు.జిల్లా వైద్యాధికారులు కోటకొండ ప్రభుత్వ వైద్యశాల మీద ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారా తేట తెల్లమవుతుంది.ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన వైద్య సిబ్బందిని ఇక్కడ నియమించి ప్రజలకు వైద్యం అందించాలని ప్రజలు డిమాండ్ చేశారు.




# మా ఉపాధ్యాయుడిని మా పాఠశాలకు పంపాలి

- ఎస్ఎఫ్ఐ,ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా.

**దామరగిద్ద,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, ఉడుమలగిద్ద ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు యాదయ్య శెట్టి గత ఆరు సంవత్సరాలుగా నారాయణపేట జిల్లా కేంద్రంలో డిప్యూటేషన్ మీద డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని,దీనివల్ల ఉడుమలగిద్ద విద్యార్థులు నష్టపోతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్,ఎన్ఎస్ యు ఐ జిల్లా నాయకులు అన్వర్ ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం పాఠశాల తరగతులను బహిష్కరించి పాఠశాల ముందే ధర్నాకు కూర్చున్నారు.పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చేవరకు రోజువారిగా ఆందోళనలకు పూనుకుంటామని,లేనిపక్షంలో డీఈఓ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని,మా ఉపాధ్యాయుడు మాకే రావాలని నినదించారు.



# విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా,మద్దూర్ మండలం,ఖాజీపూర్ గ్రామానికి చెందిన రవికుమార్ ప్రజల అవసరార్థం రెండు రాష్ట్రా లైన తెలంగాణ మరియు కర్ణాటక బోర్డర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఇది నిజంగా చాలా అభినందనీయమని,కేవలం పరీక్షలే కాకుండా మందులు,డాక్టర్ల సలహాలు కూడా ఉచితంగా అందించడం జరిగిందని,సమాజంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు,ప్రజా ప్రతినిధులు ఎంతగానో అభినందించారు.శ్రీ మాతా మణికేశ్వరి ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ మాతా మణికేశ్వరి ఫార్మసీ,క్లినిక్ వేదికగా జరిగిన ఈ సేవలు నిజంగా గొప్పవని కొనియాడారు.ఈ క్యాంపు విజయవంతంగా జరగడం చాలా ఆనందంగా ఉందని రవికుమార్ తెలిపారు.ఈ క్యాంపులో డా.మోహన్ చంద్ చిన్నపిల్లల వైద్యుడు,డా.రవికుమార్ కార్డియోవాస్కులర్ టెక్నాలజిస్ట్, మరియు డా.హేమసింగ్ రాథోడ్ బిఎఎంఎస్ ప్రతి ఆదివారం అలాగే డా.శ్రీనివాస్ బిహెచ్ఎంఎస్ ప్రతి శనివారం సేవలందిస్తారని తెలిపారు.

# జలసిరి గురించి మహిళా సంఘాలకు అవగాహన

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య ఆధ్వర్యంలో జలసిరి గురించి మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య మాట్లాడుతూ... ప్రజలు ఇండ్లలో ఇంకుడు గుంతలు,ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దర్ముల రవి,మహిళా సంఘం అధ్యక్షురాలు ఒరగంటి దీప్తి, ఇల్లందుల లత,సి.ఏ.లు లావణ్య,సుమలత,మహిళ సభ్యురాలు పాల్గొన్నారు.





# ప్రభుత్వ విప్ విజయరమణకు సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**


పెద్దపల్లి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ విజయరమణ రావు కి మంత్రి హోదా కల్పించడంతో పెద్దంపేట సర్పంచ్ సునీత స్వామి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతారావేన సంతోష్,వార్డు సభ్యులు,గ్రామ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి పోస్టర్ ఆవిష్కరణ

- జలసిరి సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ రేకుల జ్యోతి
- ఉప సర్పంచ్ మేడి అశోక్ గౌడ్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలో గంగారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రేకుల జ్యోతి ,ఉప సర్పంచ్ మేడి అశోక్ గౌడ్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ....గ్రామ రైతులు, ప్రజలు ఇండ్లలో ఇంకుడుగుంతలు,వ్యవసాయ



భూమిలో ఫార్మ్ పాండ్స్,ఊటకుంటల కొరకు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ షాబోద్దీన్,మాజీ ఉపసర్పంచ్ గుడ్ల సంపత్,ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# ఎస్సై కి ఘనంగా సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లో నూతనంగా ఎస్సైగా ఇటీవల పదవి బాధ్యతలు స్వికరించిన గట్ల సుధాకర్ ని మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొడ్డుపెల్లి సాయి కిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి



## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్లో ఇటీవల నూతనంగా ఎస్సై గా బాధ్యతలు తీసుకున్న గట్ల సుధాకర్ ని మిర్జంపేట గ్రామ సర్పంచ్ పోశాల శైలజసదానందం గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పుల్లూరి అన్వితసాగర్,బొడ్డుపెల్లి సాయి,కిరణ్,సిరికొండ సతీష్, సిరికొండ చంటి,సిరికొండ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు,ఎల్లుండి భారీ వర్షాలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

వాతావరణ నిపుణులు,క్లైమటాలజిస్టులు అందించిన నివేదికల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో 2026 జూలై 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు,కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కంది ,పెసర, నువ్వులు,పొద్దుతిరుగుడు, అలసంద,కూరగాయలు, పప్పుధాన్యాలు,చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసేందుకు అత్యంత అనుకూల సమయమని,జిల్లా కలెక్టర్ సూచించారు.సకాలంలో విత్తనాలు వేయడం వల్ల నేలలో తగినంత తేమ లభించి పంటలు ఆరోగ్యంగా ఎదిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఆగస్టు 10 వరకు మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ అవి చెరువులు నిండేందుకు,భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడవని, వీటిని నమ్ముకుని వరి వంటి పంటలు వేస్తే రైతులు దెబ్బతింటారని ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఈ అనుకూల వర్షాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజల చూపు ప్రభుత్వ దవాఖాన వైపు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.131 కోట్ల విలువైన వైద్య సేవలు
- కాంగ్రెస్ హయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు...
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా తనే పత్రి వార్డుకు కలియ తిరుగుతూ ప్రతి ఒక్కరిని కలుస్తూ వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ మాట్లాడుతూ...పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 131కోట్ల విలువైన వైద్య సేవలను అందించడం జరిగిందని,ఆసుపత్రికి సంబందించి రూ.40 లక్షల రూపాయల వ్యయంతో వివిధ విభాగాలకు సంబంధించి అత్యధునిక సామాగ్రిని వైద్య సేవల కోసం అందజేయడం జరిగిందని కంటి శుక్లలు ముందు వెనుక భాగాలు పరీక్షించే అత్యధునిక పరికరాలు,ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని కొలిచే పరికరాలు,పంటి రూట్ కెనాల్ చేసే అత్యధునిక పరికరాలు,మోకాళ్ళ కీళ్ల మార్పిడి తొడ ఎముక కాళీ ఎముక పరికరాలు,ఆపరేషన్లో ఉపయోగపడే ఆత్యాధునికమైన ఎక్రే ఇమేజింగ్ పరికరాలు,నడుము మెడ నొప్పులను తగ్గించే అత్యధికమైన పరికరాలు మోకాలు గుజ్జు అరగకుండా కండరాలు బ్రీత్ తగ్గించే పరికరాలు,చెవి వినికిడి సామర్థ్యం లెక్కించే యంత్రం చెవి ముక్కు గొంతు లోపలి భాగాలను పరీక్షించే యంత్రాలతో పాటు చర్మ వ్యాధులను పరీక్షించే అత్యాధునికమైన దేర్మ చైర్ అన్ని రకాల పరికరాలు,చిన్న చిన్న పులిపిర్లు తొలగించే కాటన్ యంత్రం అన్ని రకాల యంత్రాలను రూ.40 లక్షల రూపాయల నిధులతో ఆసుపత్రిలో సమకూర్చడం జరిగిందన్నారు.సంవత్సర కాలం నుండి దాదాపు 50 లక్షల రూపాయల వ్యయంతో 10 వార్మర్లు, 7 ఫోటో థెరపీ యూనిట్లు, 2 సిపాపు,1 వెంటిలేటుతో ఎస్ ఎన్ సి యు ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.విజయవంతంగా ఈరోజు వరకు 990 మంది నవజాతి శిశువులకు సంవత్సర కాలంలో దాదాపు 9 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఎస్ ఎన్ యు లో నవజాతి శిశువులకు సేవలు అందించడం కోసం కరీంనగర్ 3 నెలలు కొంతమంది స్టాప్ కి ట్రైనింగ్ ఇప్పిచ్చి సంవత్సరం కాలం నుండి జీతాలు ఇస్తూ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఆసుపత్రికి 20 లక్షల రూపాయల వ్యయంతో నూతన ఆంబులెన్స్ ను అందించిన అందించడం జరిగిందన్నారు.రెండు సంవత్సరాల కాలంలో దాదాపు 2081 మందికి ఆర్థో సర్జరీలు చేయడం జరిగింది దాదాపు 10 కోట్ల 40 లక్షల 50 వేల రూపాయల వరకు ఈ రెండు సంవత్సరాలల్లో ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందజేయడం జరిగిందని,దాదాపు 6478 మందికి జనరల్ సర్జరీలు చేయడమైనది దాదాపు 32 కోట్ల 38 లక్షల 50 వేల రూపాయల వరకు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సంవత్సర కాలంలో దంతా వైద్యనికి సంబంధించి దాదాపు 216 కి సర్జరీలు చేయడం జరిగిందని,21లక్షల 60 వేల వరకు ఖర్చు చేయడమైనదని,దాదాపు 3096 కటారక్ సర్జరీలు జరుగుతే సుమారు 94 లక్షల 98 వేల రూపాయలు వరకు ఖర్చు చేయడం జరిగిందని,దాదాపు 1000 విలువ గల UGS స్కానింగ్లు 40,923 జరిగాయి సుమారు 4 కోట్ల 9 లక్షల 20 వేల వరకు ఖర్చు చేశామన్నారు దాదాపు 2355 మందికి టూడికో పరీక్షలు చేయడం జరిగిందన్నారు సుమారు 47 లక్షల 10 వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. దాదాపు 32 వేల 38 మందికి ఉసీజ పరీక్షలు చేయడం జరిగింది సుమారు కోటి 13 లక్షల పై చిలుకు ఖర్చు చేశామన్నారు మన ఆసుపత్రి సంబందించి దాదాపు ల్యాబ్ టెస్ట్ లు చర్మ ఒపీ గాని ఫిజియో థెరఫీ గాని అలాగే దాదాపు 5067 డెలివరీలు చేయడం జరిగిందని,25 కోట్ల 33 లక్షల రూపాయలు ఖర్చు చేశారని,జిల్లా ఆసుపత్రిలో 1 లక్ష విలువ చేసే ల్యాప్కో స్కోపి 24 సర్జరీలు, 2 లక్షల వీలువ చేసే 3 ఆర్తోస్కోప్ సర్జరీలు,1 లక్ష వీలువ చేసే 3 యూరాలజీ సర్జరీలు చేశారని,33 లక్ష రూపాయలు ఖర్చు చేశామన్నారు.ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఆసుపత్రికి సంబంధించి ఈ రెండు నర సంవత్సరాలల్లో 5 లక్షల 12 వేల 290 మంది మందులు ఇవ్వడం జరిగిందని,సుమారు దీని విలువ 25 కోట్ల 60 లక్షల 45 వేల రూపాయలు వరకు ఒపీ మీద పెషేంట్లకు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.ఆసుపత్రి రెండు సంవత్సరాల్లో 131 కోట్ల 62 లక్షల 68 వేల రూపాయలు పేద ప్రజానీకనికి ప్రభుత్వం ఆసుపత్రి ద్వారా ఖర్చు చేయడం జరిగిందని,రెండు సంవత్సరాల క్రితం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఆరోగ్య కరంగా పేషెంట్లు వస్తే సరైన వైద్య సేవలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.ప్రజా ప్రభుత్వంలో ఈ రెండు నారా సంవత్సరాలల్లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని 130 కోట్ల పై చిలుకు రూపాయలతో ఈ రెండు సంవత్సరాలల్లో పేదల వైద్య సేవలు అందించే విధంగా పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ,జిల్లా మంత్రి శ్రీధర్ బాబు వారందరి సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో నంబర్ వన్ స్థానం రావడానికి కృషి చేసిన ఆస్పత్రి సూపర్డెంట్,ఆర్ఎమ్ఓ,హాస్పిటల్ సిబ్బంది కి క్రెడిట్ దక్కుతుందని ఈ సందర్భంగా తెలిపారు. పెద్దపల్లి ఆసుపత్రి ఇంత మంచి వైద్య సేవలు అందించడానికి మొదటి స్థానం రావడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్, హాస్పిటల్ అధికారులు, వైద్యులు,జిల్లా గ్రంధాలయం చెర్మన్,పెద్దపల్లి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు, పట్టణ కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# స్పార్క్ రూపకర్త నాగేశ్వర్ కు 'మనో మార్గదర్శక్ బెస్ట్ సైకాలజిస్ట్' అవార్డు

- కౌన్సిలింగ్ సైకాలజీ ద్వారా డ్రగ్స్ కు వ్యతిరేకంగా చేస్తున్న సేవలకు దక్కిన గుర్తింపు




**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** మద్యం,డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసైన కుటుంబాలలో చీకట్లు కమ్ముకున్న ఎంతోమంది యువకుల జీవితాలలో తాను రూపొందించిన స్పిరిచువల్ కౌన్సిలింగ్ సైకాలజీ కార్యక్రమం 'స్పార్క్' ద్వారా వెలుగులు నింపుతూ సంపూర్ణ పరివర్తన తీసుకు వసున్న కరీంనగర్ కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్,ఐ ఆర్ సి ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డిజి నాగేశ్వర్ గాలిపల్లికి రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మక 'మనో మార్గదర్శక్ ఉత్తమ సైకాలజిస్ట్' అవార్డు వరించింది.జాతీయ సైకాలజిస్ట్ ల దినోత్సవంను పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్ లో అడ్వాన్స్డ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా లయన్స్ ఇంటర్నేషనల్ ఆల్ ఈజ్ వెల్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రధానం చేశారు.కరీంనగర్ నగర్ జిల్లా నుండి నాగేశ్వర్ కు ఈ అవార్డు రావడం పట్ల సైకియాట్రిస్ట్ డా. పురుషోత్తం,సర్జన్ డా. ఎలగందుల శ్రీనివాస్,కోల అన్నారెడ్డి,ఈద కుమారస్వామి, ఆలయన్స్ జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు..

# ఒక్క ఓటు మిస్ కావద్దు..

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి



**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19,4వ వార్డులకు చెందిన పోలింగ్ బూత్ల్లో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి బీఎల్ఓలు,బీఎల్ఏలను కోరారు.ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా ఇంటింటి సర్వే నిర్వహించి,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మడిపోజు రాజేష్,ఆడెపు దేవరాజ్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో సీట్లు పెంచాలి

- సొంత భవనాలు మంజూరు చేయాలి
- బీసీ ఆజాదీ స్టూడెంట్స్ ఫెడరేషన్



**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా :** హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో సీట్ల కొరత కారణంగా ప్రతి సంవత్సరం వందల మంది అర్హులైన బీసీ విద్యార్థులు హాస్టల్ ప్రవేశాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుడికాల భాస్కర్,స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్ గౌడ్ అన్నారు.ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్ కి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.జిల్లాలోని అనేక ప్రభుత్వ బీసీ హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని,దీంతో విద్యార్థులకు సరైన వసతి, తాగునీరు, పరిశుభ్రత,భద్రత, అధ్యయనానికి అనువైన వాతావరణం వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు.బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను తక్షణమే పెంచాలని,అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు శాశ్వత సొంత భవనాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారిని కోరినట్లు తెలిపారు.అదేవిధంగా హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతి,పరిశుభ్రమైన మరుగుదొడ్లు,భద్రత,అధ్యయనానికి అనువైన వాతావరణం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జినుకల లక్ష్మణ్ రావు, శివకుమార్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# వ్యవసాయ క్షేత్రంలో 'పల్లవి' పాఠశాల విద్యార్థులు

- రైతుల ప్రాముఖ్యతను తెలుసుకున్న విద్యార్థులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:** తరగతి గది విద్యను వాస్తవ ప్రపంచ అనుభవాలతో అనుసంధానించే ప్రయత్నంలో భాగంగా,పల్లవి పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇటీవల స్థానిక వరి పొలాలను సందర్శించారు.పంటల సాగు, ఆహార ఉత్పత్తికి సంబంధించిన కష్టతరమైన ప్రక్రియను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి,అలాగే రైతులకు తగిన గౌరవం ఇవ్వడానికి ఈ విద్యాపరమైన క్షేత్రస్థాయి సందర్శన ఎంతగానో దోహదపడింది.ఈ సందర్శన సమయంలో విద్యార్థులు సాంప్రదాయ,ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు.స్థానిక రైతులతో నేరుగా ముచ్చటించి,చిన్న గింజ నుండి మన భోజన వంటకం వరకు బియ్యం పడే ప్రయాణాన్ని తెలుసుకున్నారు.వరిని ఎలా నాటాలి,ఎలా సంరక్షించాలి,ఏ విధంగా కోతకోయాలి అనే అంశాలను రైతులు విద్యార్థులకు వివరించారు.మన ఆహార అవసరాలను తీర్చడానికి రైతులు పడే శ్రమ,ఓర్పు,అంకితభావాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం గురించి పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ...విద్యార్థులలో బాధ్యతాయుతమైన భావాలను పెంపొందించడంలో అనుభవపూర్వక అభ్యాసం ఎంతగానో ముఖ్యమని తెలిపారు.వ్యవసాయ పద్ధతులను పుస్తకాల ద్వారా చదవడం వేరు,స్వయంగా వరి పొలంలో నిలబడి ఆ కష్టాన్ని అనుభవించడం వేరు.ఒక్కో గింజ విలువను,సమాజంలో రైతు పాత్ర ఎంత ముఖ్యమో మా పిల్లలు తెలుసుకోవాలన్నదే మా ప్రధాన ఉద్దేశం.అన్నం పెట్టిన రైతన్నలను ఎప్పుడూ గౌరవించాలని మేము మా విద్యార్థులకు నేర్పుతున్నామని, ఈ ఇంటరాక్టివ్ సెషన్ అంతటా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నీటి నిర్వహణ, నేల ఆరోగ్యం,పంటల గురించి ఎన్నో ప్రశ్నలు అడిగి విషయాలు తెలుసుకున్నారు. రైతుల కష్టాన్ని, సమాజానికి వారు చేస్తున్న సేవను చూసి తాము ఎంతగానో స్ఫూర్తి పొందామని విద్యార్థులు తెలిపారు.విద్యార్థులకు స్వాగతం పలికి,తమ అమూల్యమైన జ్ఞానాన్ని పంచుకుంటూ ఈ విద్యా యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన స్థానిక రైతాంగానికి పల్లవి పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.


## పెరుగుతున్న ఆత్మహత్యలు జీవితం అమూల్యం..

# సమస్యలు తాత్కాలికం



**క్షణికావేశంలో తీసుకున్న ఒక నిర్ణయం... ఎన్నో జీవితాలను శాశ్వతంగా విషాదంలోకి నెడుతుంది. రోజురోజుకూ సమాజంలో వినిపిస్తున్న ఆత్మహత్యల వార్తలు కలవరపెడుతున్నాయి. ఒకప్పుడు అరుదుగా కనిపించే ఈ ఘటనలు ఇప్పుడు దాదాపు ప్రతి వయసు, ప్రతి వర్గం, ప్రతి వృత్తిలో కనిపిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, గృహిణులు, యువత, వృద్ధులు ఎవ్వరూ ఈ సమస్యకు అతీతులు కారు. సాంకేతికంగా ప్రపంచం ఎంతో ముందుకు సాగింది. సమాచార విప్లవం, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష విజయాలు, డిజిటల్ జీవనం అన్నీ మనిషి జీవితాన్ని సులభతరం చేశాయి. కానీ అదే సమయంలో మానసిక ఒత్తిడి, ఒంటరితనం, పోటీ, అంచనాలు కూడా పెరిగాయి.**

ఫలితంగా ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా భరించలేని పరిస్థితికి కొందరు చేరుకుంటున్నారు. ఆత్మహత్యకు ఒకే ఒక్క కారణం ఉండదు. అనేక వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక, మానసిక అంశాలు కలిసి ఒక వ్యక్తిని తీవ్ర నిరాశలోకి నెట్టవచ్చు. చాలా సందర్భాల్లో సమస్య కంటే "దీనికి పరిష్కారం లేదనే భావన" ప్రమాదకరంగా మారుతుంది. విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన నేటి విద్యా వ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలు, సమాజం చూపే పోలికలు, సోషల్ మీడియా ప్రభావం, తోటి విద్యార్థుల విజయాలతో తమను తాము తక్కువగా భావించడం వంటి కారణాలు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఒక పరీక్షలో విఫలం కావడం అంటే జీవితం విఫలమైనట్లు కాదు. చరిత్రలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు మొదటి ప్రయత్నంలో విజయం సాధించలేదు. వైఫల్యం ఒక పాఠం మాత్రమే అది జీవితానికి ముగింపు కాదు. విద్యార్థులే కాదు ఉద్యోగులు, అధికారులు సైతం ఎదుర్కొంటున్న ఒత్తిడికి గురవుతున్నారు. ఉద్యోగ జీవితంలో పనిభారం, లక్ష్యాల ఒత్తిడి, పై అధికారుల ప్రవర్తన, ఉద్యోగ భద్రతపై భయం, కుటుంబ బాధ్యతలు కలిసి మానసిక ఒత్తిడిని పెంచుతాయి. కొందరు తమ సమస్యలను ఎవరికీ చెప్పకుండా మనస్సులోనే దాచుకుంటారు. ఈ మౌనం క్రమంగా తీవ్ర నిరాశకు దారితీయవచ్చు. ఉద్యోగం కోల్పోతే మరో ఉద్యోగం వెతుక్కోవచ్చు. కానీ జీవితాన్ని కోల్పోతే తిరిగి పొందలేం. అందుకే సమస్యలను పంచుకోవడం, అవసరమైతే సెలవు తీసుకోవడం, వృత్తిపరమైన సహాయం పొందడం బలహీనత కాదు బాధ్యత అనే విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. కుటుంబాల్లో సైతం మారుతున్న సంబంధాలు కుటుంబం అనేది మనిషికి మొదటి అండ. కానీ అదే కుటుంబంలో అపార్థాలు, ఆర్థిక ఇబ్బందులు, భార్యాభర్తల మధ్య విభేదాలు, అత్తాకోడళ్ల సమస్యలు, పిల్లలతో దూరం, సక్సెస్ అవ్వలేదని వంటి అంశాలు మానసిక వేదనకు కారణమవుతున్నాయి. ప్రతి ఇంట్లో అభిప్రాయ భేదాలు సహజం. మాట్లాడుకుంటే పరిష్కారం దొరకని సమస్యలు చాలా తక్కువ. పరస్పరం వినడం, అర్థం చేసుకోవడం, గౌరవించడం కుటుంబ బంధాలను బలపరుస్తాయి. మీరు మారలేము, ఎదుటివారిని మార్చలేమనుకుంటే కుటుంబం నుంచి విడిపోయి ఎవ్వరికి వాళ్ళు ఉంటూ, ఎక్కడైనా కలసినప్పుడు మంచిగా మాట్లాడుకుంటూ ఉండడం కూడా ఒక మార్గమే. ప్రేమ, నిరుద్యోగం, ఒంటరితనం యువతలో ప్రేమలో విఫలం కావడం, నిరుద్యోగం, భవిష్యత్తుపై అనిశ్చితి, సోషల్ మీడియాలో ఇతరుల జీవితాలతో తమను పోల్చుకోవడం వల్ల ఆత్మన్యూనత భావం పెరుగుతోంది. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే మొత్తం జీవితం కాదు. మీ ప్రేమను వదులుకునేందుకు వాళ్ళు సిగ్గుపడేలా, తలదించుకునేలా బ్రతకండి. మీ తల్లిదండ్రుల కష్టాలను తలచుకోండి మీకు ఏ ప్రేమ గొప్పదో కూడా తెలుస్తుంది. అలాగే ఉద్యోగం దొరకకపోవడం, ఆలస్యమవడం లాంటివి ఎదురైతే అవకాశాలు ముగిసిపోయినట్లు కాదు. ప్రతి ఒక్కరి జీవితం విభిన్న ప్రయాణం, చదివిన చదువుకే ఉద్యోగం అంటే చదివిన ప్రతివారికి ఉద్యోగాలు దొరకవు. చదువు విజ్ఞానం పెంచడానికి, ఉద్యోగం అనేది ప్రయత్నం మాత్రమే. బ్రతకడానికి అనేక మార్గాలున్నాయి, ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవాలి అందరికి ఆదర్శంగా ఉండేలా బ్రతికి చూయించాలి. మరోవైపు రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సవాళ్లు రైతులకు ప్రకృతి వైపరీత్యాలు, అప్పులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యాపారులకు ఆర్థిక నష్టాలు, మార్కెట్ ఒడిదుడుకులు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి. రైతులు ప్రత్యయమార్గాలలో వేరే పంటలసాగు చేయాలి, వ్యాపారస్తులు చేస్తున్న వ్యాపారంలో నష్టం వస్తే మరో వ్యాపారం వైపు దృష్టి పెట్టాలి. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు షేర్ మార్కెట్ అనేది ఒక మాయ ప్రపంచంలాంటిది ఉన్నది లేనిది లేనట్టు చూస్తుంది, అత్యాశకు వెళ్లి సర్వం పోగొట్టుకుంటున్నారు, ఒక్కసారి నష్టవచ్చినప్పుడు మరోమార్గంలో అన్వేషించాలి, పోయిన వద్దనే వెతుకోవడమంటే మిమ్మల్ని, మీరు మోసం చేసుకోవడమే అవుతుంది. సినిమాలో సక్సెస్ అవ్వలేదని, మోడీలింగ్ రంగంలో గుర్తింపు రాలేదని, సమాజంలో గుర్తింపు రాలేదని, సోషల్ మీడియాలో ఫాలోయర్స్ లేరు అని, లైక్స్ లేవని, ఎవ్వరో ఏదో కామెంట్ చేసారు అని ఇలా అనేక కారణాలతో జీవితాలను వదిలేసుకుంటున్నారు, ఒక్క రంగం కాకపోతే మరోరంగం ప్రపంచం చాల విశాలమైనది, విస్తరించి ఉన్నది అనేది విషయాన్ని గుర్తెరగాలి, వత్తిడికి గురైన సందర్భంగా మనస్సులో బాధను నమ్మకమైనవారితో షేర్ చేసుకోవడం మిమ్మల్ని మీరు రక్షించుకున్నట్టే అవుతుంది. ఆత్మహత్యల నివారణకు కుటుంబ సహకారం, ప్రభుత్వ అవకాశాలు, ఆర్థిక సలహాలు, సామాజిక మద్దతు ఎంతో అవసరం. బలవన్మరణాల నివారణకు అందరి పాత్ర అవసరమే. ఆత్మహత్యల నివారణకు ఒక్క ప్రభుత్వ చర్యలు సరిపోవు. కుటుంబం, పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ సంస్థలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సమాజం అందరూ కలిసి పనిచేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడాలి. ఉపాధ్యాయులు దండనకు, మార్కులకే కాకుండా విద్యార్థుల భావోద్వేగాలను కూడా గుర్తించాలి. కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యానికి అనుకూల వాతావరణం ఉండాలి. మీడియా సంచలనాత్మక కథనాల కంటే అవగాహన పెంచే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం కోరడం సహజం. అది బలహీనతకు కాదు, సమస్యను ఎదుర్కొనే ధైర్యానికి నిదర్శనం. జీవితంలో కష్టాలు, వైఫల్యాలు, అవమానాలు, నష్టాలు ఇవన్నీ ఏవి శాశ్వతం కావు. కాలం మారినట్లు పరిస్థితులు కూడా మారతాయి. ఈ రోజు అసాధ్యంగా కనిపించే సమస్య రేపు ఒక జ్ఞాపకంగా మారవచ్చు. అందుకే క్షణికావేశంలో శాశ్వత నిర్ణయం తీసుకోవద్దు. మీ చుట్టూ బాధలో ఉన్నవారిని గమనించండి, వారికి తీర్పు ఇవ్వకుండా ఓపికగా వినండి, వాళ్లలో సగం మనస్సుభారం తగ్గుతుంది, అవసరమైనప్పుడు అండగా నిలబడండి, ఒక ఆప్యాయమైన పలకరింపు, కొంత సమయం, దూరంగా ఉన్నవాళ్లకు ఒక ఫోన్ కాల్ వాళ్లకు భరోసా, నేను ఉన్నాను అని చెప్పే మాట కొన్నిసార్లు ఒక ప్రాణాన్ని కాపాడగలవు. ఉన్నది జీవిస్తున్న జిందగీ ఒక్కటే, జిందగీని ప్రేమించండి సమస్యలను కాదు, మీ జిందగీ మీకే కాదు మీ కుటుంబానికి, సమాజానికి కూడా ముఖ్యమే. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది వెతికేయండి ధైర్యంగా నమ్మకంతో జీవితాన్ని సాగించండి.



**వై. సంజీవ కుమార్**
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్
9393613555